# ఎందుకో తెలుసా?

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

★

నన్ను మాయమ్మ ఎందుకు కొట్టేదో తెలుసా? ఆవిడకు నామీద ప్రేమ లేదనుకున్నావా? ఒకసారి నన్నావిడ కొడుతుంటే ఎవరో చూచి, "ఏమమ్మా, నువ్వు పశువ్వా, గొడ్డువా? చిన్న వెధవను పట్టుకు అట్లా కొడతావు?" అని అడిగారు లే. నువ్వుకూడా ఆవిణ్ణి పశువనిగాని, గొడ్డనిగాని అనుకున్నావా? పొరపాటు.

నన్ను కొట్టినప్పుడల్లా మా అమ్మ అంతరాత్మలో ఎంత బాధపడేదో నీకు తెలుసా? పైకి మామూలు మొహంపెట్టి గుండెలు వెక్కి వెక్కి ఏడవొచ్చు తెలుసా? నీకు తెలీదు. తన కన్న కొడుకుని ఎవరూ చూడనిసమయంలో కూడా గట్టిగా కౌగలించుకునే ధైర్యం లేక పోవడం ఎంత బాధాకరమో నీకు తెలుసా? నువ్వు నిద్రపోతున్నావనే నమ్మకంతో ఒక్కసారి ముద్దు పెట్టుకుందామని మొహం దగ్గిరికి తెచ్చి, తీరా ఇంకో అంగుళంలో నీ చెంప ఉందనగా—ఆవిడ ఊపిరి నీ చెంపమీద తగిలికూడా — బిడియం కొద్దీ మొహం వెనక్కి తీసుకునే మనిషి అంతరాత్మ, పంజరంలో పక్షిమాదిరిగా, ఎట్లా కొట్టుకుంటుందో నీకు తెలుసా?

నువ్వు ఏ చదువూ సంధ్యా లేని ఆడదానవై వుండి, సంఘంలో అమలులో ఉన్న ఆచారాలు హేయమైనవనే జ్ఞానం నీలో ఉండి, వాటిని ప్రతిఘటించే సంస్కారం లేకపోతే ఏం చేస్తావు?

నీ కొడుకు తెలివిగలవాడనీ, తెలివికితోడు సాహసం కూడా ఉంటే సమాజం ఆదరించని ప్రవర్తనలో పడతాడనీ భయం ఉంటే ఏం చేస్తావు?

నీ కొడుకును కొట్టకపోతే నీకు పిల్లల్ని పెంచే పద్ధతి చాత

కాదనీ, నువ్వు నీ పిల్లాణ్ణి పాడు చేస్తున్నావనీ, నలుగురూ అంటూ ఠనే అభిమానండుంటే ఏంచేస్తావు?

నీ జీవితంమీద నీకు కాస యినా అధకారం లేదనుకో. ముప్ఫైఏళ్ళ నీ జీవితంలో ఒక్క స్వల్ప విషయమైనా నీ కను కూలంగా — నీ కలలు నిజమైన ట్టుగా — జరగలేదనుకో. నీలో కలలుకనే శక్తికూడా పూర్తిగా ఇంకిపోయిందనుకో, నీ కలలు మరొకరికి చెప్పుకోవడంకూడా సంఘద్రోహమేనని నీకు రూఢి అయిందనుకో, ఏంచేస్తావ్ చెప్ప గలవా ? చెప్పలేవు. నీకు తెలీదు.

నీకు వస్తుతహా తెలివి తేటలు లేకపోయినా, వాళ్ళూ వీళ్ళూ చదువుకుని చెప్పే మాటలు విన్నావు. వింటే ఏమయింది ?

వేదాంతులు వేదాంతం చెప్పారు. కష్టసుఖాలు కర్మను బట్టి కలుగుతాయన్నారు; ఇహం శాశ్వతం కాదు, పరమేచూసుకో మన్నారు; ద్వంద్వాలకుఅతీతంగా ఉండ మన్నారు. ఈ ప్రపంచం మొహం చూసి చెప్పూ-ఇది ఈ విశాలమీదనే నడుస్తున్నదా?

నీతివేత్తలు నీతి చెబుతారు. పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ బ్రహ్మపదార్థమేననీ, తేడాలు లేవనీ, అందర్నీ సమంగా చూడ మనీ, అబద్ధాలాడవద్దనీ, ఒకరి సొమ్ముకు ఆశపడవద్దనీ, ఇంకొకరి కష్టాలు నీకష్టాలుగా చూడమనీ అంటారు. అట్లా ప్రవర్తించేవాళ్ళకి ఏది గతి ?

డబ్బు తుచ్ఛమైనదని చెప్పటం ఎంతసులభం ? డబ్బు లేకుండా ఒక్కపూట గడపటం ఎంతకష్టం ? ఎన్నడైనా తిండికి మాడావా ? నీకున్న శరీరకష్టమంతా మంచినీళ్ళ కింద పారబోసినా నీ అవసరాలు సహంకూడా తీరకపోతే ఎట్లా ఉంటుందో నీకు తెలుసా ? వేలకు వేలు చేసుకునేవాళ్ళు లక్షలు చేసు కోవటానికి పడేపాట్లు గురించిన నిరసన ఎప్పుడైనా వెలిబుచ్చావా? తిండికి లేనివాళ్ళను గురించి ఎన్న డైనా ఒక్క మంచి మాట అన్నావా ? దరిద్రపుజన్మ అంటే ఏమిటో నీకు తెలుసా ? అందులో

ఆడబతుకెట్టాంటిదో ఆలోచించావా? ఆలోచించేటందుకు నీకు తీరలేదు.

ఈ కష్టజీవుల్ని గురించి నీకు ఆలోచించే శక్తిలేదు. నువ్వు చెప్పే నియమాలలో వాళ్లని ఉండమంటావు. నీ మాటవింటే వాళ్లు బాగుబడే పూచీయిస్తావా? లేక వాళ్లు నీ నీతిప్రకారం నడిచి బాగుపడలేరనీ, వాళ్లయిష్టం వచ్చిన నీతి వాళ్లు అవలంబించుకుంటారనీ సమాధానపడి తొలగిపోతావా? ఏదీ చెయ్యవు. ఆర్చలేవు, తీర్చలేవు, చూస్తూ ఊరుకోలేవు.

నాకు తెలుసు, నీవన్నీ సదుద్దేశాలే. అందుచేత ఒకపని చెయ్యి: నువ్వు ప్రపంచాన్ని మార్చు-ఎట్లా మార్చుతావో నాకు తెలీదు! మాఅమ్మలాటివాళ్లు న్యాయమైన కలలు కనే అవకాశం కల్పించు. ప్రపంచం ఆవిడవంటి మనుష్యుల సహజ ప్రేరణల కనుకూలంగా మారుతుందనే విశ్వాసం కల్గించు. ప్రేమంటే ఆవిడ కర్థమయేటట్టు చెయ్యి. తనప్రేమ ప్రకటించుకునే శక్తి ఆవిడకియ్యి. సంఘాన్ని చూసి ఆవిడ బెదిరి పోకుండా చెయ్యి. జన్మెత్తినఫలం మనోవాక్కాయాలా ఉల్లాసం ప్రకటించటమేనని ఆవిడకి తెలియజెప్పు. ఆవిడకి, పాపం, జన్మెత్తటం చేసినపాపానికి శిక్ష అనుభవించడానికేననీ, అన్నికోరికలూ చంపుకోటానికేననీ, తనకు నిలవనీడలేని సాంఘిక వ్యవస్థలో తన కాళ్లమీద తానే నిలబడాలిగాని గత్యంతరం లేదనీ, బతికి ఉండటమే ఒక విషమ పరీక్ష అనీ, అవసరాలు తగ్గించుకుని, ఇంకా తగ్గించుకుని, కాన్లూ అర్థణాలూ "రేపటి"కోసం దాచుకోవటమే రేపనేది లేకుండా పొయ్యేదాకా కార్యక్రమమనీ ఆవిడ అనుకుంటున్నది. ఇదంతా ఆవిడ పుస్తకాల్లో చదివిందికాదు— నీవంటి వాళ్లు రాసేపుస్తకాల్లో ఈవిషయాలెందుకుంటై?— అనుభవంవల్ల కట్టినబొప్పెలద్వారా నేర్చుకుంది.

ఇదంతా మార్చటం ఎట్లాగో నీకు తెలుసా? నీకు తెలీదు: నేను చెబుతా పట్టు.........